సాక్షి
జోగుళాంబ గద్వాల

సోమవారం ၊ 4 ၊ ఆగస్టు ၊ 2025



కలగానే 'నవోదయం'

మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్‌లో జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుపై సంశయం వీడటం లేదు.

-8లో ▸



తగ్గుముఖం పట్టిన వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం తగ్గుముఖం పట్టింది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /23.6

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం వేళ కాస్త ఉక్కపోత తప్పదు.

న్యూస్‌రీల్

చేనేత కార్మికులకు కేంద్రమంత్రి సన్మానం



గద్వాల: నేషనల్ డెవలప్‌మెంట్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ఆధ్వర్యంలో వీవర్ సర్వీసింగ్ సెంటర్ ద్వారా ఎలక్ట్రానిక్ జాకార్డ్స్ సబ్సిడీపై లబ్ధిపొందిన గద్వాలకు చెందిన ఎనిమిది మంది చేనేత కార్మికులను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సన్మానం చేశారు. ఆదివారం ఎన్‌హెచ్‌డీసీ వారు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేనేత కార్మికులు శ్రీహరి, శివశంకర్, శ్రీను, సరిత, హిమబిందు, మల్లిఖార్జున్, వెంకటేష్, రాధను కేంద్రమంత్రి మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో నిఫ్ట్ డైరెక్టర్ మాలిని, అక్కల శాంతారాం, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి చాటుదాం



గద్వాల: విజ్ఞానం, వినోదం, వికాసం, ఆటపాటలు వ్యాయమం వంటి శారీరక శ్రమ తగ్గిపోతున్న తరుణంలో విద్యార్థి దశలోనే ప్రతిభ పోటీలు నిర్వహించి వారిలో మనోవికాసాన్ని పెంపొందించేందుకు దోహదపడుతాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభపోటీలకు సంబంధించిన కరపత్రాన్ని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశభక్తిని చాటుదాం అనే నినాదంతో ప్రజానాట్యమండలి వాళ్లు చేపడుతున్న ఈ ప్రతిభపోటీలు మంచి కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న, నాయకులు విజయ్, రాజశేఖర్, ఖలీల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి



మల్దకల్ : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకుంటూ దైవ భక్తిని పెంపొందించుకోవాలని త్రిదండి దేవనాథ జీయర్ స్వామి భక్తులకు సూచించారు. ఆదివారం మండలంలోని అమరవాయిలో ఏర్పాటు చేసిన వెంకట్రామిరెడ్డి పరమావధి కార్యక్రమానికి త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి హాజరై భక్తులకు వేదర్వశీచనాలు అందజేసి ప్రవచనాలు వినిపించారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గంలో నడుచుకోవాలన్నారు. భగవద్గీత ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి ప్రజల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజలలో దైవ భక్తిని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. భక్తులు ఆధ్యాత్మికతను అలవరచుకోవడం వలన జీవితంలో రాణించి ఉన్నత స్థానాలను చేరుకునే వీలుంటుందన్నారు. భగవంతుని చేరడానికి నాలుగు మార్గాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

గద్వాల: సీపీఎస్ రద్దు– ఓపీఎస్ అమలు కోసం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన సీపీఎస్ రద్దును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో భాగంగా సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్‌ను కోరుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు, కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు వేణుగోపాల్, నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వెంకట్‌నాయుడు, జాహెద్, రవిప్రకాష్‌రెడ్డి, ఎల్లస్వామి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో దేవుడా!

రూ.లక్షలు ఉన్నా పూరి గుడిసెల్లోనే పూజలందుకుంటున్న దేవుళ్లు



ఆలూరులో రేకుల గుడిసెలో ఆంజనేయస్వామి ఆలయం

- ఆలూరు పునరావాస కేంద్రంలో ఆలయాల నిర్మాణాలకు గ్రహణం
- ఆలయాల పేరిట బ్యాంకులో మూలుగుతున్న రూ.50 లక్షలు
- రెండున్నరేళ్ల క్రితమే నిర్మాణానికి టెండర్లు
- ఎటూ తేలని 10 శాతం స్థలంలో ప్లాట్ల పంచాయితీ

గట్టు: ఏ ఊరిలో అయినా పెళ్లి లేదా.. పండుగ.. ఇలా ఏ శుభకార్యమైనా మొదట ఆలయానికి వెళ్లి అంతా మంచి జరగాలంటూ దేవుడికి మొక్కులు చెల్లించుకుంటుంటారు. కానీ, ఆ ఊరిలో మాత్రం ఏళ్లుగా ఆలయాల నిర్మాణానికి నోచుకోక దేవుళ్ల పూరి గుడిసెలోనే ఉండిపోవడంతో గ్రామస్తులు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలయాలను పక్క గ్రామాలకు వెళ్లి చేయించుకునే పరిస్థితి నెలకొంది. చివరికి ఏటా ఘనంగా జరుపుకొనే జాతర సైతం కల తప్పినట్లయ్యింది. గట్టు మండలం ఆలూరు పునరావాస కేంద్రంలో నెలకొన్న విచిత్ర పరిస్థితి ఇదీ. ఆలూరులోని దేవుళ్ల పేరిట బ్యాంకుల్లో రూ.లక్షలు ఉన్నా ఆలయ నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదు. రెండున్నర ఏళ్ల క్రితం టెండర్లు పిలిచి పనులు అప్పగించినా.. నేటికీ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అటు ఆలయాల నిర్మాణాలు చేపట్టక.. రేకుల గుడిసెలో దేవుడు తలదాచుకుంటూ పూజలందుకునే పరిస్థితి నెలకొంది.

శుభకార్యాలు.. పెళ్లిళ్లకు ఇబ్బందులే

ఆలూరు గ్రామంలో ఆలయాలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. శుభకార్యాయాలు, పెళ్లిళ్లు జరుపుకోవాలన్నా ఆరుబయటే జరుపుకోవాల్సిందే. దేవుడి దీవెనల కోసం పూరి గుడిసెలో ఉన్న స్వామి వారిని దర్శించుకునే పరిస్థితి గ్రామంలో ఇప్పటికి కొనసాగుతోంది. గ్రామంలో ఆలయాల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో ఇప్పటికి పండుగలు, వివాహాది శుభకార్యాయాలు నిర్వహించుకునే సందర్భంలో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి కొత్తగా వచ్చిన వారు గ్రామంలో ఆలయాలు లేకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పట్టువిడుపులు మాని ఆలయ నిర్మాణానికి అధికారులు, ప్రజా ప్రతి నిధులు కృషి చేయాలని ఆలూరు గ్రామస్తులు కొరుతున్నారు.



ఆలూరులో వివాదాస్పదంగా మారిన ఖాళీ స్థలం ఇదే..

ఆలయం నిర్మించాలి



ఆలూరు పునరావాస కేంద్రంలో నూతన ఆలయాల నిర్మాణం చేపట్టని కారణంగా ఇబ్బంది పడుతున్నాం. పెళ్లిళ్లను ఊరిలో కాకుండా ఇతర ప్రాంతాల్లో చేసుకునే పరిస్థితి నెలకొంది. దేవుళ్లను గుడిసెల్లోనే పూజించుకుంటున్నాం. బస్టాండ్ పక్కనే ఉన్న 10 శాతం ఖాళీ స్థలం ఆలయాలు, ఫంక్షన్ హాల్, పబ్లిక్ పార్కు కోసం కేటాయించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పునరావాస కేంద్రంలో నూతన ఆలయాలను నిర్మించాలి.

– మహేష్‌గౌడ్, ఆలూరు

త్వరలో నిర్మాణాలు చేపడతాం

పునరావాస కేంద్రంలో ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఆలయంతో పాటుగా వివిధ నిర్మాణాలకు మరిన్ని నిధులు రావాల్సి ఉంది. వీటిపై సమీక్షించి, ఏడాదిలోపు నిర్మాణాలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, అడిషనల్ కలెక్టర్

ముంపునకు గురైన 'ఆలూరు'

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా **ర్యాలంపాడు రిజర్వాయర్ నిర్మాణంలో ఆలూరు గ్రామం ముంపునకు** గురైంది. **2016లో ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పూర్తి స్థాయి 4 టీఎంసీల నీటిని** నింపడం**తో ఆలూరు గ్రామస్తులు గ్రామాన్ని** ఖాళీ **చేసి, పునరావాస కేంద్రంలోకి** మకాం **మారారు. ముంపు గ్రామస్తులకు** అప్పట్లో **బింగిదొడ్డి తండా సమీపంలో** ప్రభుత్వం **130 ఎకరాల్లో** పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి, 1,452 మందికి ప్లాట్లను కేటాయించింది. ఆలూరు ముంపు గ్రామస్తులతో పాటుగా ఆలయాలకు ప్రభుత్వం పరిహారాన్ని అందజేసింది. ఇక్కడి గ్రామస్తుల ప్రధాన దైవం ఆంజనేయస్వామి, శివాలయం. ఆలయాలకు ప్రభుత్వం సుమారుగా రూ.28 లక్షల పరిహారం అందజేస్తే.. బ్యాంకులో దాచుకున్న ఆ డబ్బులు ఇప్పుడు రెట్టింపయ్యాయి. ఈ నిధులు రూ.50 లక్షలకు చేరాయి. రెండున్నర నెలల క్రితమే ఆలూరు పునరావాస కేంద్రంలో ఆంజనేయస్వామి, శివాలయాల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లను పిలిచి పనులు అప్పగించింది. పనులు ఇప్పటికి ప్రారంభం కాలేదు.

ప్లాట్ల కేటాయింపు వివాదం

ఆలూరు గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న 10 శాతం ఖాళీ స్థలంలో ఆంజనేయస్వామి, శివాలయంలో పాటుగా వాల్మీకి, కనకదాసుల విగ్రహాలు రేకుల మధ్య గుడిసెల్లో పూజలందుకుంటున్నారు. ఇక్కడి ఆంజనేయస్వామి జాతరను ప్రతి ఏటా జనవరిలో గ్రామస్తులు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ ఆలయ నిర్మాణం కోసం 6 పాట్లను కేటాయించారు. మిగతా దాంట్లో కొందరికి ప్లాట్లను కేటాయించిన నేపథ్యంలో వివాదం నెలకొంది. ఈ స్థలం మొత్తంలో ఆలయ నిర్మాణంతోపాటుగా జాతర, వివాహాది శుభకార్యాయాలు జరుపుకొనేందుకు అనువుగా ఆలయంతో పాటుగా ఖాళీ స్థలం ఉండాలని కొందరు పట్టుబట్టారు. ఈ పురనరావాస కేంద్రంలో రెండు చోట్ల పబ్లిక్ పర్పస్ కోసం బస్టాండ్ దగ్గర 3 ఎకరాలు, గ్రామం మధ్యలో 3 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇందులో కొంత మేరకు అన్యాక్రాంతం అయినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ పక్కనే ఉన్న మొత్తం ఖాళీ స్థలం మొత్తం దేవాలయాలు, గ్రామంలో నిర్వహించే శుభకార్యాలు, ఉత్సవాల కోసం అలానే ఉంచాలని మరికొందరు గ్రామస్తులు పట్టుపడుతుడుతున్నారు. ఆలయానికి కావాల్సిన 6 ప్లాట్లు సరిపోతాయని, మిగిలినవి లోతట్టు ప్రాంతంలో కట్టడాలకు పనికి రాని చోట కేటాయించిన వారికి ప్లాట్లను ఇవ్వాలని మరి కొందరంటున్నారు. ఆలయ నిర్మాణంపై గ్రామస్తుల్లో ఏకాభిప్రాయం లేని కారణంగా ఆలయాల నిర్మాణంపై ప్రభావం పడింది.

అభివృద్ధిని ఇంటింటా వివరించండి



రాజోళి వీవర్స్ కాలనీలో బీజేపి పథకాలను వివరిస్తున్న మాజీ ఎంపీ పోతుగంటి రాములు

రాజోళి: బీజేపి హయాంలోనే గ్రామాల్లో నూతన శకం మొదలైందని.. బీజేపీ హయాంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధిని ఇంటింటా వివరించాలని నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. గృహ మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం మండల కేంద్రం రాజోళిలో మండల అధ్యక్షుడు శశి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ...బీజేపి ప్రభుత్వం, నరేంద్ర మోదీ ప్రధానిగా గ్రామాలకు అందించిన సేవలను వివరించారు. నేడు గ్రామాల్లో కనిపిస్తున్న అభివృద్ధి ప్రధాని మోదీ ద్వారానే సాధ్యమైందని అన్నారు. సీసీ రోడ్లు, ఉచిత బియ్యం, ముద్ర రుణాలు, విశ్వకర్మ రుణాలను అందించి సాధారణ, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసిందన్నారు. దేశ భద్రతలో భాగంగా ఆర్టికల్ 370 రద్దు, మైనార్టీ మహిళల కోసం త్రిపుల్ తలాక్ రద్దు, ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రమూకలను తోక ముడుచుకునేలా చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలను ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి, హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అబద్ధపు హామీలను, రిజర్వేషన్ల పేరుతో ఓట్లు కాజేసేందుకు మళ్లీ ప్రజల్లోకి వస్తుందని, వారిని ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంపై, బీజేపీ పాలనపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉందని, రానున్న అన్ని ఎన్నికల్లో బీజేపి విజయఢంకా మోగిస్తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ...ఈ నెల 4,5 తేదీలల్లో మండల నాయకులు, బూత్ అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు 100 ఇళ్లకు తిరిగి బీజేపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్,సంజీవ రెడ్డి,రాజశేఖర్,నాగేశ్వర్ రెడ్డి, నాగరాజు, గోవిందు రాజులు, గోపాల కృష్ణ, భగత్ రెడ్డి బీమన్న తదిదరులు పాల్గొన్నారు.

పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి చేద్దాం



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

కొల్లాపూర్: పెరుగుతున్న డిమాండ్, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ హితమైన విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఉదయం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిలలో జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో విద్యుదుత్పత్తి, వినియోగం, ఉత్పాదక సామర్థ్యం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. హైడల్ పవర్‌తోపాటు పంప్‌డ్ స్టోరేజీతో పెద్దఎత్తున విద్యుదుత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 23 పాయింట్స్ గుర్తించి, వాటిమీద సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. కృష్ణానదిపై ఉన్న జూరాల నుంచి పులిచింతల వరకు గల హైడల్ ప్రాజెక్టులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైతే అంతర్జాతీయంగా పేరుగాంచిన కన్సల్టెంట్ల సహకారం తీసుకోవాలని చెప్పారు. సోలార్ ద్వారా పగటిపూట ఉత్పత్తి చేసే విద్యుత్‌ను స్టోరేజీ చేసి రాత్రివేళల్లో వినియోగించుకునేందుకు అవసరమైన సాంకేతిక, స్టోరేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక వినియోగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. 1978లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తోషిబా, మిస్టుబుషి వంటి సంస్థల సాంకేతికతను వినియోగించుకున్న విషయాలను ఆయన గుర్తుచేశారు. సాంకేతికత వినియోగం కోసం కిందిస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష అనంతరం స్థానిక లంబాడీ గిరిజనులతో డిప్యూటీ సీఎం మాట్లాడారు.

పాలమూరు వెనుకబాటుకు పాలకులే కారణం

అచ్చంపేట రూరల్: పాలమూరు ఉమ్మడి జిల్లా వెనుకబాటుకు పాలకులే కారణమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో నిర్వహించిన రిటైర్డ్ ఎంఈఓ పడాల బాలజంగయ్య మూడవ వర్ధంతి సభకు ప్రొఫెసర్లు హరగోపాల్, లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. ప్రకృతిని ప్రేమించని వారు మనిషిని ప్రేమించలేరన్నారు. మానవ సంబంధాలు బాగుండాలంటే మానవీయ కోణం అవసరమన్నారు. మనిషి స్వార్థపరుడని.. స్వార్థంగానే బతకాలనే వాదన ముందుకొచ్చిందన్నారు. పెట్టుబడిదారి విధానం ప్రజల మధ్య సంబంధాలను విచ్ఛిన్నం చేసిందన్నారు.

చదువులమ్మ ఒడిలో.. సరిగమలు

ప్రభుత్వ పాఠశాలల్లో సంగీత పాఠాలు

- పీఎంశ్రీ స్కూల్స్‌కు వాయిద్య పరికరాలు అందజేత
- వారానికి ఒక తరగతి చొప్పున నిర్వహణ
- శిక్షకుల నియామకానికి కమిటీ ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 36 పాఠశాలలు ఎంపిక

సంగీతం ఒక అద్భుతం. సృష్టిలో దాని స్థానం అద్వితీయం. అందుకే చదువుల తల్లి సరస్వతీదేవికి కూడా ఒక చేతిలో పుస్తకం.. మరో చేతిలో వీణ ఉంటుంది. రాతియుగం నుంచి కంప్యూటర్ యుగం దాకా సంగీతం స్వేచ్ఛగా రాజ్యమేలుతుంది. ఇంతటి మహత్తు కలిగిన సంగీత నాదం చదువులోనూ తోడైతే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో ఉపకరిస్తుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ఆమేరకు చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సంగీత పాఠాలు బోధించేందుకు నిర్ణయించాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉదయం నుంచి రాత్రి వరకు పుస్తకాలతో కుస్తీ పడుతూ ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు ఈ సంగీత పరికరాల సాధన ద్వారా కొంతైనా ఉపశమనం కలగనుంది. అంతేగాక, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు సాయపడనుంది. ఈమేరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 36 పాఠశాలలను ఎంపిక చేశారు.

– నారాయణపేట రూరల్/ అచ్చంపేట రూరల్



ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. చదువుతోపాటు క్రీడలు, యోగా, కరాటే వంటి అంశాలను ఐచ్ఛికంగా నేర్చుకునే అవకాశాలు కల్పించింది. తాజాగా సంగీత పాటలు నేర్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పీఎం శ్రీ కింద ఎంపిక కాబడిన బడులకు ముందు అవకాశం కల్పించనుంది. ఈమేరకు ఉమ్మడి జిల్లాలో 36 పాఠశాలలను మొదటి విడత కింద ఎంపిక చేసి సంబంధిత పరికరాలను ఆ బడులకు పంపిణీ చేశారు. ఈమేరకు విద్యార్థులు రోజు పాఠ్యాంశాల బోధనకు పరిమితం కాకుండా వారంలో ఒక రోజు సంగీత పాఠాలు నేర్చుకోనున్నారు. దీంతో పిల్లలకు శ్రావణానందంతో పాటు ఏకాగ్రత పెరగనుంది. సంగీత సాధనతో వివిధ రకాలైన కళల్లో ప్రావీణ్యం పొందనున్నారు. పిల్లలు వాటిని నేర్చుకునేందుకు మరింత ఆసక్తి చూపనున్నారు. సంగీత సాధనతో టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఆయా వృత్తులలో సైతం స్థిరపడేందుకు ఉపకరిస్తుంది.

శిక్షకులు వస్తే ప్రయోజనం

పాఠశాలలకు సంగీత వాయిద్య పరికరాలు అంది నెల రోజులు అవుతుంది. కానీ, విద్యార్థులతో సాధన చేయించే శిక్షకులను మాత్రం ఇంకా నియమించలేదు. అన్ని రకాల వాయిద్యాలు తెలిసినవారు అరుదుగా ఉంటారు. సాధారణంగా ఒక్కోదాంట్లో ఒక్కొక్కరికి ప్రావీణ్యం ఉంటుంది. ఇలాంటి వారిని ఎంపిక చేయడం సులభమే కానీ అన్ని తెలిసిన వారికి రూ.10వేల గౌరవ వేతనం సరిపోతుందని ప్రభుత్వం భావిస్తుంది. భిన్న రంగాల్లో ప్రతిభ ఉన్న ఇద్దరిని నియమించి వేతన సర్దుబాటు చేస్తే పరిష్కారం లభిస్తుందని పలువురు అంటున్నారు. సంగీత పాటలు బోధించడంలో ఇప్పటికే ఆలస్యమైంది. వెంటనే సంగీత ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తయితే సంగీత పాటలు బోధించేందుకు ఆస్కారం ఉంటుంది.



నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కానుకుర్తి పాఠశాలలో సంగీత పరికరాలను విద్యార్థులకు పరిచయం చేస్తున్న టీచర్లు

36 పాఠశాలలకు పరికరాల పంపిణీ

ఉమ్మడి జిల్లాలో పీఎం శ్రీ కింద ఎంపికైన 36 పాఠశాలలకు సంగీత పరికరాలను పంపిణీ చేశారు. డోలక్, తబలా, హార్మోనియం, డ్రమ్స్, వయోలిన్ వంటివి అందించారు. వీటిని 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులతో పాటు కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో ఇంటర్ విద్యార్థులకు సైతం నేర్పించనున్నారు.

జిల్లాలో ఎంపికైన పాఠశాలల వివరాలు..

గద్వాల	జెడ్పీ స్కూల్ బాలురు, గద్వాల
మల్దకల్	జెడ్పీ స్కూల్, మల్దకల్
ఇటిక్యాల	టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ బాలురు, ఇటిక్యాల
ధరూర్	జెడ్పీ స్కూల్, ఉప్పేర్
కేటీదొడ్డి	జెడ్పీ స్కూల్, నందిన్నె
అలంపూర్	కేజీబీవీ, అలంపూర్



నారాయణపేట జిల్లా కోటకొండ పాఠశాలలకు చేరిన సంగీత పరికరాలు



నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలో ఎంపికైన కానుకుర్తి పాఠశాల

కళలను ప్రోత్సహించడం హర్షణీయం



పిల్లలకు చదువుతోపాటు వివిధ కలలను నేర్పించడం ఎంతో హర్షణీయం. చిన్నతనం నుంచి సంగీతం నేర్చుకోవడం వల్ల దేశ సంస్కృతి, సాంప్రదాయాలు తెలుస్తాయి. సంగీతం వల్ల మనస్సు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. కళల్లో ప్రావిణ్యం సంపాదిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. బాల కేంద్రానికి పరిమితమైన సంగీత శిక్షణ పాఠశాలకు విస్తరించడం స్వాగతిస్తున్నాం.

– మహిపాల్‌రెడ్డి, ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రతిభను వెలికితీసేలా..



ప్రభుత్వ బడుల్లో విద్యతోపాటు సంగీత తరగతుల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బోధనతో అలసటకు గురయ్యే పిల్లలు సంగీతంతో మరింత ఉత్సాహంగా ఉంటుంది. ప్రస్తుతం అనేక పాఠశాలలో టీచర్లు పాటాలను కథలు, గేయాల రూపంలో చెబుతూ విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నారు. సంగీత తరగతులు సత్ఫలితాలిస్తాయి.

– అన్నపూర్ణ, జీహెచ్‌ఎం, కనుకుర్తి, నారాయణపేట

సంగీత పరికరాలు వచ్చాయి



పీఎంశ్రీ పథకంలో జిల్లాలోని ఎంపిక చేయబడ్డ పాఠశాలలకు మొదటి విడత కింద సంగీత పరికరాలను పంపిణీ చేశారు. దీనికి సంబంధించి ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నాం. 6నుంచి 12వ తరగతి విద్యార్థులకు వారానికి ఒక్కో పీరియడ్ సంగీతం, వాయిద్యాలపై శిక్షణ ఇచ్చేందుకు టైం టేబుల్ ఏర్పాటు చేస్తున్నాం. కాంట్రాక్ట్ పద్ధతిలో శిక్షకుల నియామకానికి సూచనలు చేశాం.

– గోవిందరాజు, డీఈఓ, నారాయణపేట

క్లుప్తంగా

ద్విచక్ర వాహనాలు ఢీ.. యువకుడి మృతి


ప్రవీణ్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని నెల్లకొండ గేట్ సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు.. నెల్లూరు జిల్లా అనంతసాగర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ (25) స్థానికంగా ఉంటున్న మేనత్త లక్ష్మీదేవి వద్ద ఉంటున్నాడు. శనివారం తన మామ నిర్వహిస్తున్న కట్టికోత మిషన్ వద్దకు బైక్‌పై వెళ్తుండగా నెల్లికొండ గేట్ సమీపంలో ద్విచక్రవాహనం నడుపుతున్న ఓ మైనర్ ఇండికేటర్ వేయకుండా మళ్లడంతో ప్రవీణ్ బైక్‌తో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి తరలించారు. యువకుడి మృతిపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా మృతుడి మామ ఆవుల రమణయ్య ఫిర్యాదు మేరకు ద్వి చక్రవాహనం నడిపిన మైనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



కృష్ణా: మండల కేంద్రంలోని కృష్ణా బ్రిడ్జి సమీపంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని సుమారు 50 ఏళ్ల వయస్సున్న వ్యక్తి గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు కృష్ణా రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రుద్రవరం సతీష్‌కు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వైట్ కలర్ ప్యాంట్, గళ్లచొక్కా ధరించి ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు మహబూబ్‌నగర్ ఎస్‌ఐను సంప్రదించాలని కోరారు.

కర్ణాటకలో ఉజ్జెల్లి యువకుడు మృతి


బల్ల గణేష్ (ఫైల్)

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లికి చెందిన బల్ల గణేష్ (27) వరినాట్ల కోసం శనివారం కర్ణాటకకు వెళ్లి అక్కడే నీటిగుంతలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. కర్ణాటకలోని అజిలాపూర్, ఇడ్లూర్ గ్రామాల మధ్య రైతు కుంభరి శంకృప్ప పొలంలో వరి నాటు వేసేందుకు గణేష్ స్థానిక కూలీలతో కలిసి వెళ్లాడు. సాయంత్రం పని ముగిసిన తర్వాత పక్కనే ఉన్న గుంతలో కాలు, చేతులు శుభ్రం చేసుకునేందుకు వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన తోటి కూలీలు వెళ్లి చూడగా మొత్రం గుంత దగ్గర గట్టుపై చెప్పులు, దుస్తులు కనిపించడంతో కాలుజారి గుంతలో పడినట్లు గుర్తించారు. స్థానికుల సాయంతో సైదాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా రాత్రి 10 గంటల సమయంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు చేపట్టలేకపోయారు. ఆదివారం ఉదయం గాలింపు చేపట్టగా ఉదయం 10 గంటల సమయంలో మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సైదాపూర్‌కు తరలించారు. గణేష్‌కు ఐదు నెలల కిందటే పెళ్లయినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

కొల్లాపూర్: మహిళ అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హృషికేశ్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండలంలోని ఎన్మన్‌బెట్లకు చెందిన మరాఠి మంగమ్మ(45) ఆదివారం మధ్యాహ్నం కల్లు దుకాణం సమీపంలో కూర్చున్న చోటునే మృతిచెందింది. కల్తీ కల్లు తాగడంతోనే మంగమ్మ చనిపోయిందంటూ కుటుంబీకులు మృతదేహాన్ని కల్లు దుకాణం ఎదుట ఉంచి ఆందోళన చేపట్టారు. మంగమ్మ అతిగా మద్యం తాగడంతో చనిపోయిందని కల్లు దుకాణం నిర్వాహకులు తెలిపారు. మంగమ్మ మృతిపై అనుమానం ఉందంటూ ఆమె కుమారుడు కొల్లాపూర్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కల్లు శాంపిల్స్‌ను సేకరించి, దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు.

ఇద్దరు నిందితుల రిమాండ్

ఇటిక్యాల: వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ రవి ఆదివారం తెలిపారు. జూలై నెలలో ఎర్రవల్లి, ఉదండాపురంలోని పలు షాపుల్లో చోరీలకు పాల్పడగా ఆయా షాపుల యాజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఎర్రవల్లి కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో ఎర్రవల్లి, ఉదండాపురం, మల్దకల్‌లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలియజేశారు. నిందితుల నుంచి రూ.41వేల నగదు, 30 కిలోల రాగి, 15 కేజీల ఇత్తడి, ఆటో స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కలగానే 'నవోదయం'


జంగంరెడ్డిపల్లిలో స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ మోహన్‌రావు(ఫైల్)

- గండేడ్‌లో విద్యా మణిహారం ఏర్పాటుపై మల్లగుల్లాలు
- ఆరునెలలుగా స్థల పరిశీలన.. చివరికి సల్కర్‌పేటలో ఎంపిక
- కేంద్రానికి నివేదిక పంపిన అధికారులు
- పైనుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో వీడని సందిగ్ధం

గండేడ్: గండేడ్ మండలంలో జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటుపై సంశయం వీడడం లేదు. ఆరు నెలలుగా అధికారులు స్థలం ఎంపికలో మల్లగుల్లాలు పడుతున్నారు. చివరకు స్థలం ఎంపిక చేసినా కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో మీమాంస నెలకొంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని గండేడ్ మండలానికి జవహర్ నవోదయ పాఠశాల మంజూరైనట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఈ ఏడాది జనవరిలో ఓ సమావేశంలో ప్రకటించారు. గండేడ్ మండలంలో 27 జీపీలతోపాటు 13 తండాలు ఉన్నాయి. 36,328 మంది జనాభా కలిగిన ఈ మండలంలో విద్యాచైతన్యం ఎక్కువగా ఉంది. జిల్లాలోనే ఈ మండలంలో ఉపాధ్యాయులతోపాటు ఇతర ఉద్యోగుల సంఖ్య కూడా ఎక్కువే. జిల్లాలో ఉన్న ఏకైక మోడల్ స్కూల్ కూడా గండేడ్ మండలంలోని వెన్నాచేడ్‌లో ఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని మరో విద్యా మణిహారాన్ని గండేడ్ సిగలో చేర్చడానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గట్టిగా కృషిచేశారు. నవోదయ పాఠశాల గండేడ్‌కు మంజూరైనట్లు తెలిపారు. దీంతో అధికారులు స్థలం ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

సల్కర్‌పేట్‌లో ఏర్పాటుకు ఫైనల్

సల్కర్‌పేట్ శివారులో అంతర్‌గంగ లింగేశ్వరస్వామి ఆలయం వెనక ఉన్న భూములను కూడా పరిశీలించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వట్టెం నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్‌తో కలిసి స్వయంగా పరిశీలించారు. 58 సర్వే నెంబరులో 25ఎకరాలకుపైగా భూమి ఉన్నట్లు డీటీ మాధవి చూయించారు. రైతులు, ఇతరుల నుంచి ఎలాంటి సమస్య లేదని కాంగ్రెస పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్ కూడా పాఠశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉందని సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఈ స్థలాన్నే ఫైనల్ చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. ఈ విషయమై కలెక్టర్ విజయేందిరబోయితో మాట్లాడారు. అన్నిరకాలుగా స్థలం అనుకూలంగా ఉందని స్థలాన్ని ఎంపిక చేయాల్సిందిగా కోరారు. దీంతో రెండు మూడు సార్లు సర్వే చేయించి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. దీన్ని జవహర్ నవోదయ వారి అనుమతి కోసం కేంద్రానికి నివేదించారు. కాని ఇప్పటివరకు ఇంకా ఎలాంటి కన్ఫర్మేషన్ రాలేదు. దీంతో గండేడ్ మండలానికి ఈ పాఠశాల వస్తుందో రాదోనని కొందరు సంశయం వ్యక్తం చేస్తున్నారు. అటు మహబూబ్‌నగర్‌లో కూడా తాత్కాలిక వసతిలో పాఠశాల ప్రారంభం కాకపోవడంతో అక్కడ స్థలం కూడా లేకపోవడంతో గండేడ్‌కే నవోదయ పాఠశాల వస్తుందని మరికొందరు గట్టిగా నమ్ముతున్నారు. ఏదీఏమైనా నవోదయ పాఠశాల గండేడ్ మండలంలో ఏర్పాటైతే పేద విద్యార్థులకు మరింత మేలు చేకూరనుంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



నవోదయ పాఠశాల గండేడ్‌కు మంజూరైందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చెప్పడంతో సంతోషించాం. స్థలం కోసం నాలుగైదు గ్రామాల్లో వెతికాం. వివిధ కారణాలతో అవి వద్దని జవహర్ నవోదయ అధికారులు చెప్పారు. చివరకు సల్కర్‌పేట్ శివారులో భూమి ఉన్నట్లు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారొచ్చి పరిశీలించి సర్వేలు చేయించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.
– జితేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ, గండేడ్

ముఖ్యమంత్రి మాటిచ్చారు..



నవోదయ పాఠశాలను గండేడ్‌లో ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటిచ్చారు. దీంతో స్థలాన్ని ఎంపిక చేసి సర్వేలు కూడా చేయించాం. దీనినే ఫైనల్ చేయాలని, అదే నివేదికను జవహార్ నవోదయ అధికారులకు పంపాలని కోరాం. కచ్చితంగా సల్కర్‌పేట్‌లోనే నవోదయం పాఠశాల ఏర్పాటవుతుంది. కేంద్రం నుంచి అనుమతులు రాగానే పాఠశాల ఏర్పాటు పనులు ప్రారంభిస్తారు.
– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

తాత్కాలికంగా ఎక్కడా కాలేదు

గండేడ్ మండలానికి నవోదయ పాఠశాల మంజూరైనట్లు చెప్పారు. దీంతో పలుచోట్ల స్థలాల పరిశీలన జరిగింది. చివరికి సల్కర్‌పేట్ శివారులో పాఠశాల ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉంది. ఈ విషయాన్ని నవోదయ అధికారులకు నివేదించాం. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. మహబూబ్‌నగర్‌లో తాత్కాలిక వసతితో నవోదయ పాఠశాల ప్రారంభం కాలేదు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు.
– భాస్కర్‌కుమార్, ప్రిన్సిపాల్, వట్టెం నవోదయ పాఠశాల

ముందుగా జంగంరెడ్డిపల్లి ప్రస్తావన

నవోదయ పాఠశాల ఏర్పాటుకు 25 ఎకరాల స్థలం అవసరం కావడంతో జిల్లా అధికారులు దానిని గుర్తించే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే ముందుగా మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న జంగంరెడ్డిపలిలో ప్రభుత్వ స్థలం ఉందన్న సమాచారం మేరకు అధికారులు పరిశీలించారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ రెండుసార్లు గ్రామ సమీపంలో ఉన్న భూములను పరిశీలించారు. అయితే అటవీప్రాంతంతోపాటు పట్టా భూములు కూడా ఉన్నాయి. ఇది నవోదయ నిబంధనలకు అనుకూలంగా లేకపోవడంతో దానిని పక్కనపెట్టారు. అదే సమయంలో నవోదయ పాఠశాల మహబూబ్‌నగర్‌కు కేటాయిస్తున్నారని తాత్కాలిక వసతి కోసం అన్వేషిస్తున్నారని వార్తలు వచ్చాయి. అప్పట్లో ఏమైందో తిరిగి గండేడ్‌లో పాఠశాల ఏర్పాటు చేస్తారని చెప్పడంతో చిన్నవార్వాల్, పెద్దవార్వాల్ మధ్యలో మరో స్థలాన్ని పరిశీలించారు. దీనికి ఆనుకొని చెరువు ఉండడంతో అది కూడా తిరస్కరించారు.

నిర్వాసితుల త్యాగం మరువలేనిది


నిర్వాసితులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: తరతరాలుగా అనుభవిస్తున్న భూములు, ఇళ్లను లక్షలాది మంది రైతుల కోసం చేసిన నిర్వాసితుల త్యాగాన్ని చరిత్ర ఎన్నటికీ మరచిపోలేదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్లూరు గ్రామం వద్ద వేలాది మంది ఉదండాపూర్ నిర్వాసితులతో ఆదివారం ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా నిర్వాసితులకు భోజనం వడ్డిస్తూ.. వారి ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదని, కనీసం వారి గోడును విన్న పాపాన కూడా పోలేదన్నారు. తాము మొదటి నుంచి నిర్వాసితులకు న్యాయం చేయాలని ఎన్నోసార్లు ఆందోళనలు చేపట్టినట్లు గుర్తుచేశారు. నిర్వాసితుల కోసం సొంత ప్రభుత్వంపైనే పోరాడుతున్నానని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని రూ.16.30 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచేందుకు ఒత్తిడి చేస్తున్నానన్నారు. త్వరలోనే దీనిపై ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశం ఉందన్నారు. ఉదండాపూర్ నిర్వాసితులకు తమ ప్రభుత్వం అండగా ఉందన్న విషయాన్ని వారికి భోజనం పెట్టి మరీ చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి తనకు ఫోన్ చేసి చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 9లోగా పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒకవైపు పాలమూరు బిడ్డ సీఎంగా.. మరోవైపు జడ్చర్ల నియోజకవర్గ అల్లుడిగా నీటిపాదరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఈ ప్రాంత సమస్యలు తెలిసి ప్రజలతో మమేకమైన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, ఎంపీ మల్లురవి అండగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రజల సహకారం ప్రభుత్వానికి ఉంటే మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం నిర్వాసితులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన వరద

- జూరాల ప్రాజెక్టుకు 1.08 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..
- 6 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల


నిండుకుండలా ప్రియదర్శిని జూరాల జలాశయం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో 1.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆదివారం రాత్రి 7.30 సమయంలో 1.08 లక్షలకు తగ్గినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 6 క్రస్ట్ గేట్లను ఎత్తి 61,788 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. విద్యుదుత్పత్తి నిమిత్తం 32,095 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 44, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 680 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.750 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు అధికారులు వివరించారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

రాజోళి: సుంకేసుల జలాశయానికి ఆదివారం ఎగువ నుంచి వరద వచ్చి చేరింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి 26 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఆరు గేట్లు మీటర్ మేర పైకెత్తి 25,662 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి లక్ష్యం వైపు పరుగులు తీసోంది. ఈ ఏడాది 610 మి.యూ. లక్ష్యంగా కాగా.. ఇప్పటి వరకు 407 మి.యూ. విద్యుదుత్పత్తి సాధించారు. ఆదివారం ఎగువన 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 186.214 మి.యూ. దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 221.756 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ శ్రీధర్ వివరించారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 407.970 ఎంయూ విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

కవుల డైరెక్టరీ ఆవిష్కరించడం అభినందనీయం


కవుల డైరెక్టరీని ఆవిష్కరిస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో కవులు, రచయితల డైరెక్టరీని ఆవిష్కరించడం అభినందనీయమని జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు వి.మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఆదివారం తెలంగాణ సాహితీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కవులు, రచయితల డైరెక్టరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో సురవరం ప్రతాపరెడ్డి వెలువరించిన గోల్కొండ కవుల సంచికను ఈ డైరెక్టరీ గుర్తుకు తెస్తుందన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్దన మాట్లాడుతూ సామాజిక స్పృహతో, సమాజాన్ని చైతన్యపరిచేలా మరింత విస్తృతంగా రచనలు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కవుల డైరెక్టరీని వెలువరించడంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, అధిగమించిన తీరును తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజామైనొద్దీన్, కొప్పుల యాదయ్య వివరించారు. కార్యక్రమం ప్రారంభంలో చిన్నారి మేఘన నృత్యరూపకం అలరించింది. కార్యక్రమంలో తెలంగాణ సాహితీ సలహాదారులు పరిమళ్, ఉపాధ్యక్షుడు బాదేపల్లి వెంకటయ్యగౌడ్, కార్యదర్శులు కాళిదాసు, ప్రమోద్‌కుమార్, ఉమ్మడి జిల్లాలోని వందలాదిమంది కవులు, రచయితలు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన శతాబ్ది ఉత్సవ కమిటీ



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణను బాదేపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం కలిశారు. మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో కలుసుకుని నవంబర్ నెలలో నిర్వహించే ఉత్సవాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించాలని కోరారు. అదేవిధంగా పాఠశాలను విజిట్ చేయాలని విన్నవించారు. స్పందించిన ఎంపీ రాష్ట్రపతికి పాఠశాల నుంచి, శతాబ్ది ఉత్సవ కమిటీ నుంచి ఉత్సవాల గురించి మెయిల్ చేయాలని కోరారు తాను మెయిల్ చేసి రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ తీసుకుంటానని ఎంపీ భరోసా ఇచ్చారు. పార్లమెంట్ సమావేశాల అనంతరం పాఠశాల విజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఉత్సవాలకు కేంద్రమంత్రులను ఆహ్వానించాలని అందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఎంపీని కలసినవారిలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు, ఎంఈఓ మంజులాదేవి, హెచ్‌ఎం చంద్రకళ, కమిటీ ఉపాధ్యక్షులు సత్యం, వెంకటేశ్, కోశాధికారి రామకృష్ణ, కార్యనిర్వహణ కార్యదర్శి ఆనంద్, ఉపాధ్యాయులు ఇబ్రహీం, గోపాల్, లక్ష్మణ్, మౌనిక ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీ- ఏలో చేర్చాలి



రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీరవీందర్‌ని సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు


మెట్టుగడ్డ: రాష్ట్రంలో 60 శాతం ఉన్న ముదిరాజ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, బీసీ డీ నుంచి బీసీ ఏ కి మారుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోవాలని తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ అన్నారు. ఆదివారం రాష్ట్ర ముదిరాజ్ సంఘం మహిళా అధ్యక్షురాలు డి.లక్ష్మీరవీందర్‌ను పట్టణ మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగన్మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో భారీ సంఖ్యలో ముదిరాజ్ అభ్యర్థులను నిలబెట్టి తమ సత్తా ఏంటో రాష్ట్ర ప్రభుత్వం కు చూపిస్తామని ఆయన అన్నారు. అనంతరం మహిళా అధ్యక్షురాలు లక్ష్మీరవీందర్ మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళల సత్తా చాటుదామని, మహిళా శక్తి ఏంటో రాష్ట్ర ప్రభుత్వానికి చూపించేందుకు ముదిరాజ్ మహిళలు అధిక సంఖ్యలో పోటీకి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. పట్టణ మహిళా అధ్యక్షురాలు సునీత ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పి .రజనీకాంత్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ నరసింహులు ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ్ ముదిరాజ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్,సిరా నారాయణ, ముదిరాజ్ఉద్యోగుల సంఘం నాయకులు నరేందర్, తిరుపతమ్మ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

మల్దకల్: మండలంలోని మద్దెలబండ ఆంజనేయ స్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీ చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఆదివారం ఆలయం గేటు తాళాలను పగులగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. ఆలయ సమీపంలో హుండీ పగులగొట్టి ఏడాదిగా భక్తులు సమర్పించిన కానుకలు అపహరించినట్లు ఆలయ నిర్వాహకుడు సిద్ధప్ప తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

108 సిబ్బంది నిర్లక్ష్యం.. గర్భస్థ శిశువు మృతి


జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మనీషా


కడుపులో చనిపోయిన మగ శిశువు

పెద్దకొత్తపల్లి: 108 అంబులెన్స్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తన కుమారుడు మృతిచెందాడని మృతుని తండ్రి నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నకారుపాములకు చెందిన నర్సింహ భార్య మనిషాకు ఆదివారం పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకొచ్చి పెద్దకొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద సిబ్బంది డ్యూటీ మారడంతో అరగంటపాటు కార్యాలయం వద్ద అంబులెన్స్ వద్ద నిలిపివేశారు. దీంతో మనీషా కడుపులో ఉన్న మగ శిశువు మృతి చెందాడు. డ్యూటీ మారిన డ్రైవర్ అంబులెన్స్‌ను పీహెచ్‌ఎస్‌కి తీసుకరావడంతో అక్కడున్న స్టాఫ్ నర్సు గర్భిణి పరిస్థితి విషమించిందని తక్షణమే నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి చేరేలోగా కడుపులో బిడ్డ మృతిచెందింది. నాగర్‌కర్నూల్ ఆస్పత్రి సిబ్బంది కడుపులో నుంచి మృతశిశువును బయటికి తీశారు. 108సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తన మగ శిశువు చనిపోయిందని నర్సింహ జిల్లా వైద్యులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని జిల్లా వైద్యాధికారి రాజేశ్వరి చెప్పిందని తెలిపారు. అలాగే 108 సిబ్బందిపై పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేస్తామని నర్సింహ, బంధువులు మల్లేశ్, నరేశ్, కృష్ణ, పరమేశ్ తెలిపారు.

రెండు తులాల బంగారు గొలుసు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో బంగారు గొలుసు చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన జ్యోషి కళ్యాణ్‌శర్మ నాగనూలు చౌరస్తాలోని తన ఇంటికి గతనెల 28న తాళం వేసి బళ్లారి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటితాళం విరగ్గొట్టి సూట్‌కేస్‌లో ఉన్న రెండుతులాల బంగారు గొలుసు చోరీ చేశారు. జ్యోషికళ్యాణ్‌శర్మ బళ్లారి నుంచి శనివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తాళం విరగ్గొట్టి ఉండడంతోపాటు సూట్‌కేసు తెరిచి ఉండడం గమనించి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు వేళాయె


మహబూబ్‌నగర్‌లో ఎస్‌జీఎఫ్ అండర్- 17 జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలు (ఫైల్)

- 20 వరకు మండలస్థాయిలో టోర్నీ కం సెలక్షన్స్
- వచ్చేనెల మొదటి వారంలో జిల్లా, మూడో వారంలో ఉమ్మడి జిల్లా ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: త్వరలో పాఠశాల స్థాయిలో క్రీడల సందడి నెలకొననుంది. ఈ నెలతోపాటు రానున్న రెండు నెలలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు జరగనున్నాయి. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రతి ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల స్థాయిలో అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల స్థాయి నుంచి జిల్లా, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తారు.

ఈ నెల 20లోగా..

పాఠశాల స్థాయిలో అండర్-14, 17 విభాగాలకు మండల, జిల్లాస్థాయి, జోనల్ (ఉమ్మడి జిల్లా) స్థాయిల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలోని మండలాల్లో ఈ నెల 20లోగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహిస్తారు. సెప్టెంబర్ మొదటి వారంలో జిల్లాస్థాయి, మూడో వారంలో ఉమ్మడి జిల్లా (జోనల్) స్థాయిలో టోర్నమెంట్ సెలక్షన్స్ నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన జట్లు అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లకు వెళ్తాయి.

వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

2025- 26 సంవత్సరానికి గాను 69వ ఎస్‌జీఎఫ్ క్రీడలకు సంబంధించి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులతో మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 1న జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ మేరకు డీఈఓ ప్రవీణ్‌కుమార్ వ్యాయామ పోటీల నిర్వహణపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపికలను పారదర్శకంగా నిర్వహించాలని, విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపొందించి, క్రీడా శిక్షణ ఇవ్వాలని సూచించారు.

పూర్తి చేయాలి..

మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ఈ నెల 20 వరకు పూర్తి చేయాలి. ఈ ఏడాది జిల్లాకు 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాల, బాలికల క్రికెట్ టోర్నీలు కేటాయించారు. రాష్ట్రస్థాయి టోర్నీలకు కోసం జిల్లా నుంచి త్వరలో పలు ప్రతిపాదనలు పంపుతాం. జాతీయ, రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలను పకడ్బందీగా నిర్వహిస్తాం.
– శారదాబాయి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

విద్యార్థులు ప్రతిభ చాటాలి

పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడా వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభచాటాలి. ప్రతి ఏడాది జిల్లా విద్యార్థులు జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రానున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు రాణించాలి.
– వేణుగోపాల్, సీనియర్ పీడీ, చిన్నదర్పల్లి (మహబూబ్‌నగర్)